## క్లుప్తంగా

### 21న ఆధ్యాత్మిక కార్యక్రమం

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ ఉలమా అయిమ్మ కమిటీ కడప శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేది రాత్రి 9 గంటలకు ఇస్లాం ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అగాడి వీధిలోని ఇనాయత్ ఖాన్ తాలీంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక గురువులు హాజరై ప్రసంగిస్తారు.

### ఆహార పొట్లాల పంపిణీ



కడప ఎడ్యుకేషన్ : కడప పాత రిమ్స్‌లోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహం, జెడ్పీ ఆవరణలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహ అనాథ వృద్ధులకు లయన్స్ క్లబ్ క్యాంపు చైర్మన్ డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ లయన్ చిన్నపురెడ్డి, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గౌరీశంకర్, రంగనాయకులు, నిరంజన్‌రెడ్డి, నటరాజ, సంజీవరెడ్డి పాల్గొన్నారు.
కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని పలు కూడళ్లలో ఉంటున్న అనాథలకు అమృతవల్లి ప్రకాశ్ ఆహార పొట్లాలను అందజేశారు.

### 20న సాహిత్య పోటీలు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 20 ఏళ్లుగా సేవలు అందించి ఆకస్మికంగా మృతి చెందిన చంద్రకిశోర్‌కు అక్షర నివాళులర్పిస్తున్నామని యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. వైవీయూ ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి నేరుగా రాలేని వారు తమ సందేశాలు, స్మృతి కవిత్వాన్ని వాట్సాప్ ద్వారా పంపవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సమర్పించిన పద్యాలు, కవితలు, పాటలను పుస్తక రూపంలో తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94408 59872 ఫోన్ నంబరులో సంప్రదించాలని వివరించారు.

### మానసిక ప్రశాంతత అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న కడప డీపీటీఓ గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : డ్రైవర్లు, కండక్టర్లు మానసిక ప్రశాంతత అలవర్చుకుని విధులు నిర్వర్తించాలని కడప డీపీటీఓ పాలిమేర గోపాల్‌రెడ్డి, ఓం శాంతి బ్రహ్మకుమారి ప్రదీప అక్కయ్యలు కోరారు. మంగళవారం కడప డీపీటీఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ ట్రైనింగ్ ప్రోగామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ప్రశాంతతతో ఏదైనా సాధించవచ్చన్నారు. ప్రశాంతంగా విధులు నిర్వర్తించినపుడే ప్రయాణికులు ఆర్టీసీ వైపు మొగ్గుచూపుతారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ పి.లక్ష్మీభాస్కర్, బద్వేలు డిపో మేనేజర్ జీఎస్ రావు, పీజేడీఏ కృష్ణారెడ్డి, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ డీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల బిల్లులు ఆమోదించాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఉప ఖజానాశాఖాధికారి పరిధిలోని ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, ప్రొద్దుటూరు, రాజుపాళెం, చాపాడు, దువ్వూరు మండలాల పరిధిలోని ఉపాధ్యాయుల వేతనాల బిల్లులను వెంటనే ఆమోదించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఉప ఖజానాశాఖాధికారి తిరుపతి స్వామిని ఆయన కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాత్కాలిక పదోన్నతుల కింద ఉన్నత పాఠశాలలో పని చేసిన సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులకు రూ.2,500 అలెవెన్స్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. ఇటీవల బదిలీ పొందిన టీచర్ల వేతన బిల్లులను, మెడికల్ బిల్లులను జాప్యం లేకుండా ఆమోదించాలని తెలిపారు. పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులతో చర్చించి వారి ఆదేశాల మేరకు బిల్లులను ఆమోదిస్తామని ఎస్టీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, కుల్లాయిరెడ్డి, జిల్లా కార్యదర్శి మునివర్ధన్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లు అప్సర్ పాషా పాల్గొన్నారు.

### జ్వరాలపై అవగాహన అవసరం



అధికారులకు సూచనలు ఇస్తున్న మలేరియా నివారణ అధికారి హుసేనమ్మ

ప్రొద్దుటూరు క్రైం : డెంగీ జ్వరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుసేనమ్మ తెలిపారు. మండలంలోని దొరసానిపల్లె గ్రామంలో మంగళవారం అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# శివానీ.. భవానీ



గాయత్రిదేవిగా శ్రీ లలితాంబ

కడప కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాలు మూడవ రోజున మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. నగరంలోని అమ్మవారి ఆలయాలన్నీ విద్యుద్దీప కాంతులతో 'నవ'రాత్రి శోభతో ఉట్టిపడుతున్నాయి. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. కడప నగర పరిధిలోని దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామిని చంద్రప్రభ వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. అమ్మవారిశాలలో శ్రీ అన్నపూర్ణగా కన్యకాంబను కొలువుదీర్చారు. శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో చంద్రఘంట అలంకారం, గడ్డిబజారు సత్యదేవుని ఆలయంలో స్వామిని శ్రీ రాధాకృష్ణునిగా అలంకరించారు. మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని మంగళగౌరీ మాతగా అలంకరించారు. చిన్నబెస్తవీధిలోని బాల పోలేరమ్మ ఆలయంలో బాల పోలేరమ్మ అలంకారం చేశారు. ప్రాంగణంలో ఉంచిన 12 అడుగుల అమ్మవారి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. భద్రావతి భావనారుషి ఆలయంలో ఆకర్షణీయమైన వేదికపై అమ్మవారిని కంచి కామాక్షమ్మగా కొలువుదీర్చారు. నగర శివార్లలోని శ్రీ లలితాంబిక ఆలయంలో శ్రీ గాయత్రిదేవి అలంకారం చేశారు. ఎర్రముక్కపల్లె చౌడేశ్వరీదేవిని లలితాంబగా, నబీకోట శివాలయంలో అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారిని అలంకరించారు. ఇంకా పలు గంగామాత ఆలయాలు, చౌడేశ్వరీమాత, ఇతర గ్రామ దేవతలు, ఆలయాలలో విశేష అలంకారాలను దర్శించేందుకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.



రాధాకృష్ణ అలంకారంలో శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామి



విశేష అలంకారంలో శ్రీ బాలపోలేరమ్మ



అన్నపూర్ణగా శ్రీ వాసవాంబ



చంద్రప్రభ వాహనంపై కడప రాయుడు



శ్రీ రాజరాజేశ్వరిగా నడివీధి గంగమ్మ



గడ్డిబజారు శివాలయంలో శ్రీ పార్వతిగా..



భావనారుషి ఆలయంలో కంచి కామాక్షిదేవిగా..



చంద్రఘంట అలంకారంలో శ్రీ విజయదుర్గాదేవి



శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



భావనారుషి ఆలయంలో బొమ్మల కొలువు

## శ్రీకృష్ణదేవరాయల పాలన ఆదర్శనీయం

కడప కార్పొరేషన్ : శ్రీకృష్ణదేవరాయల పాలన స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు అన్నారు. మంగళవారం శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి సందర్భంగా క్రిష్ణా సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో అన్ని కులాలకు సమ ప్రాధాన్యత కల్పిస్తూ రాయల పాలన సాగిందన్నారు. కళలు, సంప్రదాయాలు, వ్యవసాయానికి ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. శ్రీకృష్ణదేవరాయలను ఆదర్శంగా తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, తోట క్రిష్ణ, షఫీ, కోలా కొండయ్య, చెన్నంశెట్టి మురళీ, రామక్రిష్ణ, శివకేశవ, బండి బాబు, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం, మేయర్

**డిప్యూటీ సీఎంకు వినతి**

కడప ఎడ్యుకేషన్ : మౌలానా అబుల్ కలాం జయంతి రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నవంబర్ 11న కడపలో నిర్వహించాలని రాయల్ సేవా సమితి అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రాయల్ కరీముల్లా కోరారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన మౌలానా అబుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని విద్యా దినోత్సవ రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని కడపలో నిర్వహించాలన్నారు.



శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలిజ అభ్యుదయ సేవా సమితి ప్రతినిధులు

**'బాస్' ఆధ్వర్యంలో..**

కడప కల్చరల్ : శ్రీకృష్ణ దేవరాయల వర్ధంతిని కడప నగరానికి చెందిన బలిజ అభ్యుదయ సేవా సమితి (బాస్) కార్యాలయంలో ఆ సంస్థ అధ్యక్షులు దాసరి శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొమ్మినేని సుధీర్, దేవినేని వెంకటేశ్, సుబ్బయ్య, జక్కాశివ, నీలం రవి, కుప్పాల శ్రీను, చంద్ర సురేష్, మునిమోహన్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జంక్షన్ల పనులు ముమ్మరం చేయాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న జంక్షన్ల పనులను ముమ్మరం చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన మార్కెట్ యార్డు, మాసాపేట, మాచుపల్లి, డీసీరోడ్డు, గోకుల్ లాడ్జి, అల్మాస్‌పేట, అప్సర రోడ్డు, వై జంక్షన్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కోటిరెడ్డి సర్కిల్, ఏడు రోడ్ల కూడలి పనులను వేగవంతం చేయాలన్నారు. కాగితాలపెంట రోడ్డు కొలతలను పరిశీలించి, ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. కేసీ కెనాల్ పక్కన 33 అడుగులతో రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

## సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

వేముల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమైందని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వేముల, వి.కొత్తపల్లె సచివాలయాలను మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో సచివాలయాలను ఉపాధిహామీ పథక నిధులతో నిర్మించామన్నారు. ఏయే గ్రామాల్లో సచివాలయాల నిర్మాణాలు పూర్తి అయ్యాయి.. ఎక్కడెక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయి.. పూర్తైన సచివాలయాలను సంబంధిత శాఖకు అప్పగించారా అనే విషయాలపై ఆరా తీస్తున్నామన్నారు. సచివాలయ నిర్మాణాలు పూర్తికాని చోట త్వరితగతిన నిర్మించాలని సూచించామన్నారు. అలాగే పూర్తి అయిన సచివాలయాలను సంబంధిత శాఖకు అప్పగించాలని సిబ్బందికి సూచించామన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### బైక్ సైలెన్సర్ల తొలగింపు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో అధిక శబ్దంతో కూడిన సైలెన్సర్లతో తిరుగుతున్న పలువురు యువకులకు పోలీసులు జరిమానా విధించారు. మంగళవారం పట్టణంలో సైలెన్సర్లను బిగించి బైకులు నడిపే వారిపై సీఐలు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సైలెన్సర్లను మార్చిన వారిని గుర్తించి వారి బైక్‌లను ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. సైలెన్సర్లను తొలగించి వాటి స్థానంలో కంపెనీ సైలెన్సర్లను అమర్చారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకునే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐలు హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో సీఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణయాదవ్, రమణారెడ్డి, యుగంధర్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

**డిప్యూటీ సీఎం అంజద్‌బాషా**

కడప కార్పొరేషన్ : 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే మెరుగైన వైద్యం తేవడం జరిగిందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక అక్కాయపల్లె అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రతి స్టాల్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిబిరానికి విచ్చేసిన రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల వల్ల పేద ప్రజలు ఇబ్బంది పడకూడదని, వారి గడప వద్దకే వైద్యాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి బ్లడ్ ప్రెషర్, షుగర్‌లను పరీక్షిస్తారన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో వారికి 7 రకాల పరీక్షలు నిర్వహించి అరగంటలో రిపోర్టులు ఇవ్వడమేగాక ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ఆ తర్వాత రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డీఎంఅండ్‌హెచ్ఓ నాగరాజు, కార్పొరేటర్ షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ శివానాయక్, ఎస్.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'జగనన్న ఆరోగ్య సురక్ష' కిట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

**జగనన్నను మరోసారి ఆశీర్వదించండి**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 29వ డివిజన్‌లోని సెవెన్‌రోడ్స్, బీకేఎం వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో తెలుసుకొన్నారు. ప్రజలకు ఇంకా ఏవైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా షేక్ షబానా అనే మహిళ మాట్లాడుతూ తమ కుటుంబానికి వైఎస్సార్ పింఛన్ కానుక, సున్నావడ్డీ, అమ్మఒడి, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.10 లక్షలు మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 29వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ రిజ్వాన్, ఇన్‌చార్జి డిష్ జిలాన్, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి, అరీఫుల్లా బాషా, పస్తం అంజి, టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తిరాజేశ్వరి, మూలే సరస్వతి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

### హోమియో వైద్య శిబిరానికి స్పందన

కమలాపురం : పట్టణ పరిధిలోని కుప్పూరువారిపల్లెలో ఏర్పాటు చేసిన హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి తదితర జ్వరాలు ఉన్న రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. హోమియోలో అన్ని రోగాలకు వైద్య సేవలు ఉన్నాయని, అలాగే ఈ మందుల వలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. ప్రస్తుతం నూతనంగా ప్రారంభించిన ఆసుపత్రిలో హోమియో వైద్యశాల ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### కృష్ణాజలాలపై సీపీఐ ఆటో ప్రచారజాత

పోరుమామిళ్ల : కృష్ణా జలాల పునః పంపిణీని వ్యతిరేకిస్తూ బుధవారం కడపలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సు నేపథ్యంలో మంగళవారం పోరుమామిళ్లలో సీపీఐ ఆధ్వర్యంలో ఆటో ప్రచారజాత నిర్వహించారు. కృష్ణాజలాలను పునఃపంపిణీ చేయడం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేయడమేనని ఆ పార్టీ నాయకులు వీరశేఖర్, మస్తాన్‌లు పేర్కొన్నారు. కృష్ణాజలాలు గతంలో చేసిన పంపిణీని యథాతథంగా కొనసాగించాలన్నారు. ప్రచార జాతాలో పార్టీ నాయకులు రవి, రమణ, కేశవ, చెన్నయ్య, రవీంద్ర, గురప్ప పాల్గొన్నారు.

**ఆర్ఎస్ఓ ఆధ్వర్యంలో నిరసన**

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్ఓ) ఆధ్వర్యంలో కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ బ్రిజేష్ ట్రిబ్యునల్ తీర్పు అమలైతే రాయలసీమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. తెలంగాణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఓ నాయకులు లింగమయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో నిర్వహించనున్న డీఎస్సీలో ఉర్దూ మీడియం ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరిపడ ఉపాధ్యాయులు లేక ఉర్దూ మీడియం విద్యార్థులు ఎంతో నష్టపోతున్నారన్నారు. రాబోయే డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రూట డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్ సాహెబ్, రూట రాష్ట్ర నాయకులు సత్తార్ ఫైజీ, సయ్యద్ సిరాజుద్దీన్, ముహమ్మద్ అయ్యూబ్, జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూట నాయకుడు ఇక్బాల్

## డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదు

కడప ఎడ్యుకేషన్ : వాహనాలను నడిపే సమయంలో సెల్‌ఫోన్‌ను వినియోగించరాదని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మీరా ప్రసాద్ అన్నారు. మంగళవారం కడప అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ రవాణాశాఖ కమిషనర్ మీరా ప్రసాద్, విద్యాసాగర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీరా ప్రసాద్ మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్‌ను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ మీరా ప్రసాద్

## ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలి

కమలాపురం : త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్, రెవెన్యూ అధికారులు కృషి చేయాలని ఆర్‌ఓ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో ఎక్కడెక్కడ ఘర్షణలు జరిగాయో వివరాలు తీసుకుని ఈ సారి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రెండు శాఖల అధికారులు కలసి ప్రతి పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేయాలన్నారు. ఎవరైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. అలాగే బైండోవర్ చేసిన వారికి జరిమాన రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐలు రామకృష్ణారెడ్డి, శంకర్ నాయక్, ఎస్ఐలు చిన్నపెద్దయ్య, తహసీల్దార్లు సరస్వతి, అలీఖాన్, ఉదయ్ భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఓ చంద్రమోహన్